



నేడే ఆఖరు

మద్యం దుకాణాలకు 580 దరఖాస్తులు
ఐదింటికి నిల్
నేటితో ముగియనున్న గడువు

పుట్టపర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మద్యం దుకాణాల దరఖాస్తులకు బుధవారంతో తెర పడనుంది. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి, ఈ నెల 1 నుంచి మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. జిల్లాలో 8 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మంగళవారం నాటికి జిల్లావ్యాప్తంగా 580 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ చెబుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకునేందుకు అవకాశం ఇచ్చినా జిల్లాలో మాత్రం వేగం పుంజుకోలేదు. ఆయా నియోజకవర్గాల్లో అధికార కూటమి నేతల బెదిరింపులు, దరఖాస్తుల్లోనే సిండికేట్ కారణంగా ఎక్సైజ్ శాఖ ఆశించిన మేర దరఖాస్తులు రాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బుధవారంతో దరఖాస్తుల గడువు ముగియనుంది. చివరి రోజు ఎన్ని దరఖాస్తులు వస్తాయోనన్న టెన్షన్ నెలకొంది. ధర్మవరం రూరల్‌లో ఒకటి, మడకశిర ప్రాంతంలో నాలుగు దుకాణాలకు దరఖాస్తులే రాకపోవడం గమనార్హం.


హిందూపురంలో వాసవీమాతకు అలంకారం

రాజరాజేశ్వరిగా దుర్గమ్మ


రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దుర్గాదేవి

లేపాక్షి, అక్టోబరు 8: దసరా శరన్నవరాత్రి వేడుకల ఆరోరోజు మంగళవారం లేపాక్షి ఆలయంలో దుర్గాదేవి శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గావీరభద్రస్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. హిందూపురంలో వాసవీమాతను మిగిలాంబికాదేవిగా అలంకరించి, పూజలు చేశారు.

శ్రీవారికి ప్రత్యేకాలంకరణ

కదిరి, అక్టోబరు 8: పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు మంగళవారం పరమపదనాథుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్యేకాలంకరణలో ఖాద్రీశుడు

జపాన్‌లో దసరా సంబరాలు

హిందూపురం అర్బన్, అక్టోబరు 8: దసరా ఉత్సవాలను జపాన్‌లో కూడా చేసుకుంటున్నారు. హిందూపురం పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక సభ్యులు జపాన్‌లోని యోకోహమా అనే ప్రాంతంలో రావణబ్రహ్మ దైవత్వం, ఆయన ప్రత్యేకతను జపాన్‌లోని తెలుగువారికి, జపాన్ వాసులకు తెలియజేశారు. రావణబ్రహ్మ చిత్రపటాన్ని అక్కడి వీధుల్లో ఊరేగించారు. రాముడి చేతిలో తనకు మరణం ముందే తెలిసిన త్రికాల జ్ఞాని రావణుడు అని బోధించారు. భగవద్గీత ప్రకారమే ఆయన జీవించాడని తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం సోమశేఖర్, హిందూపురం భార్గవి, పునీత్‌రాజ్, జస్మిత, గుంటూరు శివరాయ్, దీపిక, శిరీష, వైజాగ్ యామినీ శ్రీధర్ రాయచోటి సుచరిత, వెంకటశివప్రసాద్, మదనపల్లి అరుణ, చైతన్య తిరుపతి కుమారి, జయచంద్ర పాల్గొన్నారు.


కొలువుదీరిన శ్రీకృష్ణుడు, రావణబ్రహ్మ


జపాన్‌లో దసరా పూజల్లో పాల్గొన్న భక్తులు

ఒక్కరూ లేరు..!

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులు కరువు..
జిల్లా అంతటా ఇదే దుస్థితి.. క్రీడలకు దూరమౌతున్న విద్యార్థులు


జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)
ప్రభుత్వ జూనియర్ కళాశాల

కొత్తచెరువు, అక్టోబరు 8: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వ్యాయామ విద్య మిథ్యగా మారింది. క్రీడల్లో శిక్షణ ఇచ్చే వ్యాయామ అధ్యాపకు(పీడీ)లే లేరు. జిల్లాలోని 21 కళాశాలల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. దీంతో విశాలమైన మైదానాలున్నా.. అన్ని వసతులూ వసతులున్నా.. విద్యార్థులకు ఆటలు అందనిద్రాక్షగా మారాయి. జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 4వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి చదువుతో పాటు క్రీడలను కూడా నేర్పించాల్సి ఉంది. వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, క్రికెట్, త్రోబాల్, కబడ్డీ, ఖో-ఖో తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్దేశించింది. వారితో వ్యాయామం కూడా చేయించాలని ఆదేశించింది. జిల్లాలో ఏ ఒక్క కళాశాలలోనూ ఇవి అమలు కావట్లేదు. మొత్తం 21 కళాశాలలకు వ్యాయామ అధ్యాపకులే లేరు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడలు అటకెక్కాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

క్రీడలకు దూరమౌతున్న విద్యార్థులు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పాలకులు, అధికారులు పదేపదే చెబుతుంటారు. గత వైసీపీ ప్రభుత్వం ఆడదాం ఆంధ్రా అంటూ క్రీడలను సచివాలయ సిబ్బందికి నిర్వహించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు.. ఇందులో పాల్గొనేలా చర్యలు తీసుకోలేదు. జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు.. క్రీడలకు దూరమవుతున్నారు. కొంతమంది విద్యార్థులకు క్రీడలపట్ల ఆసక్తి ఉన్నా.. వారిలోని ప్రతిభను వెలికి తీయడానికి వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. గత వైసీపీ ప్రభుత్వం.. కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల కొరత లేకుండా చూస్తామని చెప్పింది. ఐదేళ్లలో అధ్యాపకుల కొరత తీర్చలేదు. కూటమి పాలనలోనైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు.

క్రీడలకు దూరమౌతున్నాం: గంగాద్రి, విద్యార్థి

కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విశాలమైన క్రీడామైదానం ఉంది. ఇక్కడ క్రీడలకు అనువుగా ఉంది. కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడు లేకపోవడంతో ఆటలకు దూరమౌతున్నాం.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం: రఘునాథరెడ్డి, డీఐఈఓ

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల కొరత ఉంది. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం వ్యాయామ అధ్యాపకులను కేటాయిస్తే క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తాం.

990 పనులు గుర్తించాం

కలెక్టర్ చేతన్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, అక్టోబరు 8: జిల్లాలో 990 పనులు గుర్తించి, వాటికి రూ.62కోట్లు అంచనా వేసినట్టు కలెక్టర్ టీఎస్ చేతన్ వివరించారు. ఈనెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, టీపీఓ సమత పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల పరిధిలో పనులు గుర్తించామనీ, కొన్నింటికి అనుమతులు ఇచ్చి అప్‌లోడ్ చేశామని కలెక్టర్ వివరించారు. 14వతేదీ నుంచి వారం రోజుల పాటు శంకుస్థాపనలు చేసి, పనులు వేగంగా పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

సజావుగా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తాం

జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను సజావుగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ వివరించారు. జలనవరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం విజయవాడ నుంచి సాగునీటి వినియోగదారులసంఘాల ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని, ఎన్నికల నిర్వహణపై వివరించారు. జిల్లాలో 230 పెద్ద, మధ్య, చిన్నతరహా నీటి తరహా సంఘాలు ఉన్నాయనీ, వీటికి పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 16 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందనీ, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఆదేశించారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 8: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు డీఎస్సీ శిక్షణాసంస్థల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చిన అనుభవం ఉండాలన్నారు. గతంలో డీఎస్సీ నియామకాల్లో కనీసం వందమంది అభ్యర్థులు ఉద్యోగాలు పొంది ఉండాలన్నారు. http//tender.apeprocurement. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. ఈనెల 21వ తేదీలోగా సమర్పించాలన్నారు. వివరాలకు జిల్లాకేంద్రంలోని దీనజనోద్ధరణ బిల్డింగ్ బ్లాక్ నెంబరు-5లో గల జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కొడవళ్లు, రాళ్లతో వెంటాడి..

టీడీపీ కార్యకర్తపై వైసీపీ గూండాల దాడి


గాయపడిన ధనుంజయ

ధర్మవరంరూరల్, అక్టోబరు8: మండలంలోని దర్శినమల గ్రామంలో వైసీపీ గూండాలు రెచ్చిపోయారు. టీడీపీ కార్యకర్తపై మంగళవారం రాత్రి కొడవళ్లు, రాళ్లతో దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ధనుంజయ తన పొలంలో వేరుశనగ సాగు చేశాడు. అతడి పొలం పక్కనే ఓబుళనాయునిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు, పలు కేసుల్లో నిందితుడైన గడిపూటి గంగాధర్ పొలం ఉంది. ఈ నేపథ్యంలో ధనుంజయ పొలానికి వెళ్లే దారిలో గంగాధర్, ఓబిరెడ్డి, రామ్మోహన్ ఎక్స్‌కవేటర్‌తో గుంత తీయిస్తున్నారు. అదే సమయంలో ధర్మవరం నుంచి తన ఊరికే చెందిన నారాయణస్వామితో కలిసి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తున్న ధనుంజయ గమనించి, అక్కడికెళ్లాడు. దారలో గుంత తీయించడంపై అక్కడే ఉన్న గంగాధర్, ఓబిరెడ్డి, రామ్మోహన్‌ను నిలదీశాడు. 'నువ్వెవరు రా.. చెప్పేందుకు, తీసేదే గుంత, ఎవనికి చెప్పుకుంటావో చెప్పుకో' అంటూ గొడవకు దిగారు. దీంతో కోప్రోద్రిక్తులైన వైసీపీ నాయకులు అక్కడే ఉన్న రాయిని ధనుంజయ మీదకు విసిరారు. ధనుంజయ చేయికి బలమైన గాయమైంది. వెంటనే గంగాధర్ స్కార్పియో వాహనంలో ఉన్న కొడవళ్లతో వెంటపడ్డారు. దీంతో ధనుంజయ, నారాయణస్వామి గ్రామంలోకి పరుగులు తీశారు. వెంటనే గ్రామస్థులంతా వచ్చి ఏకం కావడంతో వారు అక్కడినుంచి ఉడాయించారు. రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన ధనుంజయకు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు చేయించారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి విచారించి, కేసు నమోదుచేశారు. అక్కడే ఉన్న వైసీపీ నాయకుడు గంగాధర్ స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు.

పచ్చని పంటను దున్నేశారు..!

భూవివాదమే కారణం

నంబులపూలకుంట, అక్టోబరు 8: భూవివాదం నేపథ్యంలో మండలంలోని బందారుచెట్లపల్లి వద్ద సాగుచేసిన కంది పంటను మంగళవారం ట్రాక్టర్‌తో దున్నేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. బందారుచెట్లపల్లికి చెందిన లక్ష్మీనారాయణ, రామకృష్ణ సోదరులకు సర్వే నంబరు 186లో 9.08 ఎకరాలు, సర్వే నంబరు 190లో 2.32 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై 20 ఏళ్లుగా లక్ష్మీనారాయణ, రామకృష్ణ సోదరులకు తమ కులానికే చెందిన వారితో వివాదం నడుస్తోంది. 2021లో అన్నదమ్ముల పేరుతో పాసుపుస్తకం మంజూరైంది. దీంతో లక్ష్మీనారాయణ, రామకృష్ణ కందికుంట సాగుచేశారు. మంగళవారం కదిరికి చెందిన కొంత మంది వ్యక్తులు వచ్చి భూమి తాము కొనుగోలు చేశామంటూ ట్రాక్టర్‌తో దున్నేస్తామన్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం సాగింది. ఐదు ఎకరాల్లో పంటను పూర్తిగా దున్నేశారు. మిగిలిన పంటను కూడా దున్నేస్తుండగా.. రైతు సోదరుల కుటుంబీకులు అడ్డుకున్నారు. పోలీసులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఐదెకరాల్లో పంట దున్నేయడంతో రూ.లక్షకుపైగా నష్టపోయినట్లు వారు వాపోయారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి తెలిపారు.


కందిపంటను దున్నేసిన దృశ్యం

కూలి బతుకుల్లో కన్నీళ్లు..!

పొట్ట కూటి కోసం వచ్చి.. ప్రాణాలే పోగొట్టుకుని..
ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు కూలీల దుర్మరణం
ఐదుగురికి గాయాలు
బాధితులు జార్ఖండ్ వాసులు
విద్యుత్ సామగ్రి తరలిస్తుండగా ప్రమాదం




ప్రమద స్థలంలో సునీల్, డేనియల్ మృతదేహాలు

ఉన్న ఊరులో బతికే మార్గంలేక..
పొట్ట చేతబట్టుకుని..
ఊరు.. జిల్లా.. రాష్ట్రం దాటి వచ్చారు..
ఉదయాన్నే కూలికెళ్లారు..
విద్యుత్ సామగ్రి నిండిన ట్రాక్టర్‌లో బయల్దేరారు..
సాయంత్రందాకా పనిచేస్తే..
పైసలొస్తాయని ఆశించారు..
విధి వక్రించింది..
రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది..
కూలి బతుకులను ఛిద్రం చేసింది..
కుటుంబాల్లో కన్నీళ్లు నింపింది..


బోల్తాపడిన ట్రాక్టర్

కదిరి, అక్టోబరు 8: రోడ్డు ప్రమాదం కూలీల బతుకుల్లో కన్నీళ్లు నింపింది. తలుపుల మండలం తొగటివారిపల్లి సమీపాన మంగళవారం విద్యుత్ సామగ్రి తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు దుర్మరణం చెందగా.. ఐదుగురు గాయపడ్డారు. నంబులపూలకుంట మండలం వెలిచెలమల వద్ద కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఈ పనులను చేస్తున్న జార్ఖండ్ కూలీలు నిర్మాణ సామగ్రిని ట్రాక్టర్‌లో వేసుకుని, తొగటివాటివారిపల్లి నుంచి వెలిచెలమలకు బయల్దేదేరారు. తొగటివారిపల్లి దాటగానే వర్షం మొదలైంది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడింది. కింద పడిపోయిన కూలీల మీద విద్యుత్ సామగ్రి పడింది. ఆ సమయంలో ట్రాక్టర్‌లో పదిమంది కూలీలున్నారు. వారిలో డేనియల్ (29), సునిల్ (26) అక్కడికక్కడే మృతి చెందారు. సిద్దిఖ్, బట్లూ పూర్తి, అమర్, మిచిరా, బోస్‌జో తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురికి గాయాలు కాలేదు. క్షతగాత్రులను 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. భద్రతలేని ప్రయాణం కారణంగా రెండు నిండు ప్రాణాలు బలయ్యాయని స్థానికులు విచారం వ్యక్తం చేశారు.


ప్రమాదంలో గాయపడినవారు

అతిథిలా..



ట్రాన్స్‌కో కార్యాలయం



ట్రాన్స్‌కో కార్యాలయంలో వింత పోకడ

చుట్టపుచూపుగా వస్తున్న ఉన్నతాధికారి

మామూళ్లు ఇస్తేనే పనులు జరుగుతాయ్!

కార్యాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యం

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తాడిపత్రి, అక్టోబరు 8: స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయానికి ఓ ఉన్నతాధికారి చుట్టపుచూపుగా వస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నెలలో నాలుగు సార్లు మాత్రమే కార్యాలయానికి ఆయన వస్తుండటంతో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విసుగు చెంది ఎవరైనా అక్కడి సిబ్బందిని ప్రశ్నిస్తే 'సార్ క్యాంప్‌కు వెళ్లారు. రావడానికి నాలుగైదు రోజులు పట్టవచ్చు, తర్వాత రండి' అంటూ చెబుతున్నారు. సరేలే మళ్లీ వద్దామని వారంరోజుల తర్వాత వచ్చినా ఆ అధికారి మాత్రం కనబడడు. దీంతో సమస్యల పరిష్కారం కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పలు మార్లు కార్యాలయం వద్ద ధర్నా చేసినా అధికారి లేకపోవడంతో ఫలితం లేకుండాపోతోంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉంటూ ప్రజలకు సేవలు అందించాల్సి ఉంటుంది. కానీ ఆ ఉన్నతాధికారి మాత్రం స్థానికంగా నివాసం ఉండకుండా రాయలసీమ జిల్లాల్లోని ఓ పట్టణం నుంచి వస్తున్నాడన్న ప్రచారం ఉంది. వారంలో ఒకరోజు వచ్చి కార్యకలాపాలను చూసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఆ ఇద్దరే ఆయనకు బలం

ఆ ఉన్నతాధికారి వద్ద పని జరగాలంటే ముందుగా కార్యాలయంలోని కిందిస్థాయి అధికారుల్లో ఇద్దరిని కలవాలి. ఆ ఉన్నతాధికారి ఆ ఇద్దరిని తన కార్యకలాపాలను నిర్వహించడం కోసం, మామూళ్లను వసూలు చేయడం కోసం ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఎవరైనా సరే వారిద్దరి వద్దకు వెళ్లి రేటు మాట్లాడుతుకుని పని చేయించుకోవాల్సిందేనన్న ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు తాడిపత్రి మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలోని ఓ పరిశ్రమకు ఇచ్చిన అధిక స్లాబ్‌ను తగ్గించి సాధారణ మీటర్‌ను ఇవ్వాలని యజమాని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేశాడు. పని జరగదని తెలుసుకున్న ఆ యజమాని సిబ్బందిని విచారించగా ఆ ఇద్దరిని కలవాలని సలహా ఇచ్చారు. దీంతో ఇద్దరిని కలవగా నీ పని పూర్తి కావాలంటే రూ.80వేలు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. మీటర్ మార్చేందుకు కూడా డబ్బులు ఇవ్వాలా అని ఆశ్చర్యపోయిన ఆయన అంత ఇచ్చుకోలేను అని బేరసారాలు జరపగా చివరికి రూ.50వేలకు డీల్ కుదిరినట్లు తెలిసింది. ఇలా వారంరోజులపాటు తంతు నడిచిన తర్వాత ఒకరోజు వీలు చేసుకొని ఆ అధికారి కార్యాలయానికి వచ్చి పని చూసుకొని సంతకాలు చేసి రావాల్సిన ముడుపులు జేబులో నింపుకొని ఆ ఇద్దరికి వాటాలు ఇచ్చి వెళుతున్నాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

సిబ్బంది ఇష్టారాజ్యం

ట్రాన్స్‌కో కార్యాలయంలో ఉన్నతాధికారి విధులకు సరిగా రాకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. పలువురు ఉద్యోగులు కూడా ఉదయం ఆలస్యంగా విధులకు రావడం, వచ్చి రాగానే బయటకు వెళ్లడం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. కార్యాలయానికి వచ్చిన ప్రజలు అక్కడ ఎవరూ ఉండకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. తీరా సిబ్బంది వచ్చిన తర్వాత సమస్యను వివరిస్తే పెద్దసారు లేడు వచ్చినప్పుడు రావాలని తీరిగ్గా సమాధానం ఇస్తున్నారు. చివరికి కరెంట్ ఎప్పుడు వస్తుందని ప్రజలు ఫోన్‌చేస్తే ఎత్తేనాథుడే లేడు. కొన్నిసార్లు స్విచ్ఛాఫ్ కూడా వస్తుండటంతో ప్రజలు విసిగిపోతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం ప్రదక్షిణలు చేశా

మూతపడ్డ గ్రానైట్ ఫ్యాక్టరీకి అధిక బిల్లులు వస్తుండటంతో ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో సింగిల్ ఫేజ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేశా. ఉన్నతాధికారులు వస్తేనే నీ పని జరుగుతుందని సిబ్బంది చెప్పడం, నేను వెనుదిరగడం పరిపాటిగా మారింది. చివరికి సోలార్ లైట్లను ఏర్పాటు చేసుకున్నాం. **- రమణ, తాడిపత్రి**

అధికారులు కార్యాలయాలకు రావడం లేదు



ట్రాన్స్‌కో కార్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలలో కొన్ని రోజులు మాత్రమే విధులకు వస్తున్నారు. దీంతో పలు సమస్యలపై వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఫోన్ చేసినా అధికారుల నుంచి స్పందన ఉండటం లేదు. **- చిరంజీవి, సీపీఐ పట్టణ కార్యదర్శి**

మా దృష్టికి రాలేదు

ఈ విషయం నా దృష్టికి రాలేదు. కార్యాలయంలో విచారించి చర్యలు తీసుకుంటాం. రాతపూర్వకంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం.

- రాజశేఖర్, ట్రాన్స్‌కో డీఈ

కొనసాగిన పప్పుశనగ రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, అక్టోబరు 8: సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం ఎనిమిదో రోజు కొనసాగింది. ఇప్పటి దాకా 11822 మంది రైతులు 16410 క్వింటాళ్ల పప్పుశనగ కోసం తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విత్తన పప్పుశనగ కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు.

ఎఫ్ఎస్ఎస్ఏఐతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, అక్టోబరు 8: ఆహార భద్రతా ప్రమాణాల్ని మరింత పెంచడా నికి భారత ఆహార భద్రత సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం ఢిల్లీలో ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒప్పందం విలువరూ.88కోట్లని తెలిపారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ)కమలవర్ధనరావు, ఏపీఫుడ్ సేఫ్టీ కమిషనర్ హరికిరణ్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇనోషిశర్మ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఆహార పరీక్షల ప్రయోగశాలలు ఏర్పాటు చేసేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సుముఖత వ్యక్తం చేసిందని మంత్రి పేర్కొన్నారు. రూ.20కోట్లతో తిరుమలలో నూ, మరో రూ.20కోట్లతో కర్నూలోనూ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ ల్యాబ్‌లను నెలకొల్పేం దుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఒంగోలులో ప్రాథమిక ఆహార పరీక్షల ప్రయోగశాలల్ని ఒక్కొక్కటి రూ.7.5కోట్లతో నెలకొల్పనున్నామన్నారు. రాష్ట్రంలో ఆహార శాంపిళ్ల సేకరణ, విశ్లేషణ కోసం రూ.12కోట్లు, ఆహారభద్రతా ప్రమాణాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రూ.11కోట్లు కేటా యించేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 4 మొబైల్‌ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లకు అదనంగా మరో 22 ల్యాబ్‌లను టర్న్‌కీ విధానంతో వాడుకునేందుకు రూ.15కోట్లు కేటాయించడానికి ఒప్పందం కుదిరిందని వివరించారు.

ముగిసిన ఆంధ్రా రంజీ జట్టు శిక్షణ శిబిరం


శిక్షణలో పాల్గొన్న ఆంధ్రా రంజీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 8: గత పదిరోజులుగా స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆంధ్రా రంజీ క్రికెట్ జట్టు శిక్షణా శిబిరం మంగళవారం ముగిసింది. 2024-25 సీజన్‌కు సంబంధించి ఆంధ్రా జట్టు ఈనెల 11 నుంచి నాగ్‌పూర్‌లో విదర్భతో జరిగే రంజీ మ్యాచ్ ఆడుతుంది. జట్టులో రిక్కీ భూయ్, కేఎస్ భరత్, హనుమ విహారి, అశ్విన్ హెబ్బార్, శశికాంత్, స్టీఫెన్, నితీష్‌కుమార్ రెడ్డి ప్రధాన ఆటగాళ్లు ఉన్నారు. కార్యక్రమంలో హెడ్‌కోచ్ తిను యోహాన్, బ్యాటింగ్ కోచ్ జ్ఞానేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ విక్రంవర్మ, ఫీల్డింగ్ కోచ్ శివకుమార్ రాజు, జేటీ యాదవ్, శ్రీనివాసరావు, జై కృష్ణ, రాజు, ఫైడి రాజు, ఇమ్రాన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా.. గట్టెక్కే ఎత్తుగడ..!

కాజేసిన భూమి ఇద్దరు రైతులకు వాపసు

మిగిలిన రైతుల కళ్లుగప్పి.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ

పట్టా భూములను కంపెనీకి అమ్మేసిన రియల్టర్లు


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రియల్టర్లు, ప్రైవేటు కంపెనీ నిర్వాహకులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 8: రైతుల పట్టా భూములను గుట్టుగా ఓ ప్రైవేటు కంపెనీకి విక్రయించిన రియల్టర్లు.. ఆ వివాదం నుంచి గుట్టుగా గట్టెక్కేందుకు ప్రయత్నించారు. కాజేసిన భూముల్లో ఇద్దరు రైతులకు తిరిగి రిజిస్ట్రేషన్ చేయించి.. గుట్టుచప్పుడు కాకుండా జారుకోవాలని చూశారు. విషయం తెలుసుకున్న మిగిలిన రైతులు చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు మంగళవారం రావడంతో అక్కడి నుంచి జారుకున్నారు. న్యామద్దల చెరువు ఆయకట్టులో పట్టా భూములను కొందరు రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్నారు. వీటిపై కన్నేసిన కొందరు రియల్టర్లు.. గుట్టుగా కాజేసి ఓ ప్రైవేటు కంపెనీకి విక్రయించారు. ఈ విషయం గురించి ఆలస్యంగా తెలుసుకున్న రైతులు ఏడాది క్రితం రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. బాధిత రైతులు రియల్టర్లను, కంపెనీ నిర్వాహకులను గట్టిగా నిలదీస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు ముగ్గురు రైతులకు వారి భూములను తిరిగి రిజిస్ట్రేషన్ చేయించి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు రైతులకు మంగళవారం గుట్టుగా రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియను చేపట్టారు. విషయం బయటకు పొక్కడంతో మరికొందరు బాధితులు అక్కడికి చేరుకుని తమ భూములను కూడా రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని గట్టిగా నిలదీశారు. దీంతో హడావుడిగా తంతు ముగించుకుని.. కంపెనీ నిర్వాహకులు, రియల్టర్లు అక్కడి నుంచి జారుకున్నారు. ప్రైవేటు కంపెనీ ముసుగులో ఇద్దరు రియల్టర్లు, న్యామద్దలకు చెందిన మరికొందరు తమ భూములను కాజేశారని బాధిత రైతులు వాపోయారు. సుమారు 20 మంది రైతులకు సంబంధించి 30 ఎకరాల పట్టా భూములను కాజేశారని వారు ఆరోపించారు. తమకు జరిగిన అన్యాయం గురించి ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సూచించారని అన్నారు. కంపెనీ వారు, రియల్టర్లు కుమ్మక్కై.. ఒకరిద్దరికి భూములను రిజిస్ట్రేషన్ చేయించి తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని అన్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ అనిల్ కుమార్‌ను వివరణ కోరగా, ఇద్దరు రైతులకు పెండింగ్ రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు.

కన్నా.. వస్తున్నా.. నీ కోసం..!

కొడుకు ప్రాణం విడిచిన రైల్వే ట్రాక్‌పై.. తండ్రి బలవన్మరణం


రమేష్‌బాబు

ఒక్కగానొక్క కొడుకు..! కారణమేమిటోగానీ, ఏడాది క్రితం రైలు కిందపడ్డాడు. కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. గుండెలపై పెరిగిన కొడుకు అనూహ్యంగా కనుమరుగు కావడంతో తండ్రి జీర్ణించుకోలేకపోయాడు. రోజులు గడుస్తున్నా.. కొడుకు జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉన్నాయి. తన ముద్దుల కొడుకు మాయమైన రైలు పట్టాలపై నిత్యం తిరుగుతుండేవాడు. పోయినవాడు తిరిగి రాడన్న వాస్తవాన్ని గ్రహించలేకపోయాడు. వెతికి వెతికి.. అలసి.. కొడుకు పయనించిన మార్గంలోనే తానూ అనంత లోకాలకు బయలుదేరాడు. కన్నీటికే కన్నీరొచ్చే ఈ విషాద ఘటనకు గుత్తికోట రైల్వే స్టేషన్ వేదిక అయింది.

తాడిపత్రి టీచర్స్ కాలనీకి చెందిన రమేష్‌బాబు(53) మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహాన్ని గుత్తి కోట రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పోలీసులు గుర్తించారు. కొడుకు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న తరువాత.. తరచూ రైలు పట్టాలపై రమేష్ బాబు తిరుగుతుండేవాడు. గుత్తి కోట రైల్వే స్టేషన్‌లో అప్పుడప్పుడూ మౌనంగా తిరుగుతూ కనిపించేవాడని స్థానికులు చెబుతున్నారు. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. **- గుత్తి**

ముందే దసరా పండుగ

- కేజీబీవీ ఉద్యోగులకు రెండు నెలల జీతాలు, డైట్ బిల్లులు మంజూరు
- మొత్తం రూ.17 కోట్లకు పైగా విడుదల
- ఉద్యోగుల ఆనందం

అనంతపురం విద్య, అక్టోబరు 8: కేజీబీవీల్లో పనిచేసే ఉద్యోగులకు ముందుగానే దసరా వచ్చినట్లైంది. ఉద్యోగులు సమస్యలు గుర్తించిన కూటమి ప్రభుత్వం రెండు నెలల జీతాలు, డైట్ బిల్లులు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 2800 కేజీబీవీల టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీతాలకు, కేజీబీవీల్లో చదువుకునే విద్యార్థులకు డైట్ చార్జీల కోసం కోట్ల రూపాయల నిధులు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 62 కేజీబీవీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు 2 నెలల జీతాల కోసం రూ.13.14 కోట్లు, డైట్ బిల్లుల కోసం మరో రూ. 4.70 కోట్లు విడుదల చేశారు. ఈ మేరకు ఇటీవల స్టేట్ ప్రాజక్టు డైరెక్టర్ (ఎస్పీడీ) నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు జీతాల కోసం అనంతపురం జిల్లాకు రూ. 3.42 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ. 3.26 కోట్లు విడుదల చేశారు. సెప్టెంబరు జీతాల కోసం అనంతపురం జిల్లాకు రూ. 3.24 కోట్లు, సత్యసాయి జిల్లాకు రూ. 3.20 కోట్లు విడుదల చేశారు. మొత్తంగా రెండు జిల్లాలకు కలిపి జీతాలకే రూ.13.14 కోట్లు విడుదల చేశారు. డైట్ చార్జెస్ కింద ఆగస్టు నెలకు అనంతపురం జిల్లాకు రూ. 1.18 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ. 95.15లక్షలు, సెప్టెంబరు నెలకు అనంతపురం జిల్లాకు రూ.1.38 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి రూ. 1.18 కోట్లు విడుదల చేశారు. రెండు జిల్లాలకు జీతాలు, డైట్ బిల్లుల కోసం ప్రభుత్వం ఏకంగా రూ. 17 కోట్లకు పైగా విడుదల చేసింది. వైసీపీ పాలనలో నెలల తరబడి పెండింగ్ పెట్టేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు, డైట్ బిల్లులు అందుతుండటంతో ఆనందం వ్యక్తం చేశారు.


సమగ్రశిక్ష ప్రాజెక్టు, అనంతపురం

రెండు నెలల జీతాలు, డైట్ బిల్లులు అందించాం



స్టేట్ ప్రాజెక్టు ఆఫీస్ నుంచి రెండు నెలలకు సంబంధించి జీతాలు, డైట్ కోసం బడ్జెట్ విడుదలైంది. పండుగ రోజుల్లో ఉద్యోగులు, సిబ్బంది ఎవరూ ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో బిల్స్ బ్యాంకుకు పంపాం. ఇప్పటికే ఒక నెల జీతం ఉద్యోగుల ఖాతాలకు జమ అయ్యింది. మరో నెల జీతాలు, డైట్ బిల్లులు కూడా బుధవారం ఉదయం లేదా మధ్యాహ్నంలో జమ అవుతాయి.

- నాగరాజు, ఏపీసీ, సమగ్రశిక్ష, అనంతపురం.

మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారం



సమగ్రశిక్ష ఉద్యోగులకు రెండు నెలల జీతాలు, డైట్ బిల్లుల పెండింగ్ ఉన్న సమస్యను ప్రజాదర్బార్‌లో విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాం. దసరా పండుగలోపు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఆమేరకు సుమారు 17 కోట్లు రెండు జిల్లాలకు విడుదల చేయడం, పండగ కంటే ఆనందంగా ఉంది.

- విజయ్, జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్

గొంతు కోసుకున్న యువకుడు

పెనుకొండ రూరల్, అక్టోబరు 8: మండలంలోని అలీంబాషా అనే యువకుడు గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మంగళవారం జరిగింది. సీఐ రాఘవన్ తెలిపిన మేరకు కొడికొండ గ్రామానికి చెందిన అలీంబాషా పాలసముద్రం సమీపంలోని ఎస్ఎల్‌పి కంపెనీలో పని చేసేవాడు. అదే కంపెనీలో గుట్టూరుకు చెందిన ఓ యువతి పని చేసేది. ఈక్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. దీన్ని అలుసుగా తీసుకుని అలీంబాషా ఆ యువతిని వేధించేవాడు. అయినా ఆ యువతి మౌనంగా భరించింది. ఏడాది కిందట ఆమెకు వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె 9నెలల గర్భవతి. ఈ క్రమంలో మంగళవారం గుట్టూరుకు వెళ్లిన అలీంబాషా ఆమె ఇంటి ఎదుట గొడవపడి రభస చేశాడు. దీంతో గ్రామస్థులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో మనస్తాపం చెందిన అలీంబాషా అక్కడే తన వెంట తెచ్చుకున్న చాకుతో గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల సమాచారంతో కియ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అమ్మాయి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టమోటా కిలో రూ.50



అనంతపురంరూరల్, అక్టోబరు 8: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.35, కనిష్ఠ ధర రూ.23 పలికినట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి: డీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 8: ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు శిక్షణా సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5050 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ శిక్షణ ఇస్తున్నాయని తెలిపారు. ఎంపానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణా సంస్థలు గత రెండు డీఎస్సీ నియామకాలకు శిక్షణ ఇచ్చి ఉండాలని అన్నారు. వారిద్వారా గతంలో కనీసం వంద మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొంది ఉండాలని అన్నారు. మూడు సంవత్సరాల టర్నోవర్ కనీసం రూ.40 లక్షలు ఉండాలని అన్నారు. వివరాలతో కూడిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ డాక్యుమెంట్ నంబర్ 757795ను ఏపీ ఈ-ప్రొక్యూర్మెంట్ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 21 వరకూ అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలకు దామోదరం సంజీవయ్య సంక్షేమ భవనంలోని ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌ల ప్రక్రియను పూర్తి చేయండి

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు అర్హులైన విద్యార్థుల కొత్త, రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ కళాశాల ప్రిన్సిపాళ్లను కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్త, రెన్యువల్ చేయడానికి సేవలను జ్ఞానభూమి వి2 http://jnanabhumiv2.apcfss.in/ వెబ్ పోర్టల్ కళాశాల ప్రిన్సిపాల్ లాగిన్‌లో పొందుపరిచామన్నారు. కొత్త దరఖాస్తులు, రెన్యువల్ నమోదు ప్రక్రియను ఈ నెల 30లోపు పూర్తి చేయాలన్నారు. ఆయా కళాశాలలో స్కాలర్‌షిప్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

తల్లి, కుమార్తె అదృశ్యం... కేసు నమోదు


పద్మావతి


స్నేహ

పెనుకొండ టౌన్, అక్టోబరు 8: పెనుకొండ మండలం సీపీఎం కాలనీలో నివాసముంటున్న పద్మావతి, కుమార్తె స్నేహ కనిపించడం లేదని భర్త వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం నుంచి తల్లి కూతురు కనిపించడంలేదని చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంపద సృష్టి ఎక్కడ..?: అనంత

అనంతపురం క్రైం, అక్టోబరు 8: రాష్ట్రంలో సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ఉన్న సంపదను టీడీపీ నేతలకు కట్టబెడుతున్నాడని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక దోపిడీ జరుగుతున్నా,మద్యం పాలసీలో ప్రభుత్వానికి ఆదాయం గండి పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చారని, సూపర్ సిక్స్‌తో పాటు ఉచితంగా ఇసుక అందిస్తామని, సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తామని ఊదరగొట్టారన్నారు. ఇసుకను ఇతర జిల్లాలకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నా నియంత్రించలేని పరిస్థితి ఉందన్నారు. మద్యం షాపులకు 50వేల మంది కూడా డీడీలు తీయడం లేదన్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యాపారాలు, కాంట్రాక్టులు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కలెక్టర్, ఎస్పీలు మద్యం, ఇసుక విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు.

జీతం ఇవ్వకముందే సంతకాలు..!

- ఉరవకొండ డిగ్రీ కాలేజ్‌లో వింత రూల్స్
- అక్విటెన్స్‌పై అడ్వాన్స్‌గా సంతకాలు
- ప్రశ్నిస్తే కక్షసాధింపు
- ఇబ్బంది పడుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు



ఉరవకొండ డిగ్రీ కళాశాల

అనంతపురం విద్య, అక్టోబరు 8: కొందరు ఉన్నతాధికారుల వైఖరితో ఉరవకొండ డిగ్రీ కళాశాలలోని కాంట్రాక్ట్ లెక్చరర్లు ఇబ్బంది పడుతున్నారు. ఇతర ప్రాంతాల్లోని డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెకర్చర్లకు క్రమం తప్పకుండా జీతాలు వస్తుంటే ...ఇక్కడ మాత్రం కొర్రీలు వేస్తున్నారు. కాంట్రాక్టు లెక్చరర్లకు జీతాలు ఇవ్వకముందే అడ్వాన్స్ అక్విటెన్స్ కాపీ తీసుకుని అక్విటెన్స్ రిజిస్టర్‌పై రెవెన్యూ స్టాంప్ అతికించి దానిపై సంతకాలు తీసుకుంటున్నారు. తర్వాత ఎప్పుడో వాళ్లకు బుద్ధి పుట్టినప్పుడు జీతం ఇస్తున్నారు. ఇదెక్కడి నిబంధన అని ఎవరైనా ప్రశ్నిస్తే జీతాలు పెట్టకుండా నెలల తరబడి ఆపేస్తున్నారు.

కొత్త రూల్స్‌తో చుక్కలు

లెక్చరర్లకు 300301 పద్దు కింద జీతాలు చెలిస్తున్నారు. ఎక్కడేగాని అడ్వాన్స్ అక్విటెన్స్ కాపీలు కానీ, అక్విటెన్స్ రిజిస్టర్‌లో రెవెన్యూ స్టాంప్స్ అతికించి, దానిపై సంతకాలు తీసుకోవడం గానీ లేదు. చాలా కళాశాలల్లో ఇలాగే ఉంది. అక్విటెన్స్‌పై సంతకాలు చేస్తే జీతం తీసుకున్నట్టు లెక్క. అయితే ఉరవకొండ కాలేజ్‌లో మాత్రం మా రూల్స్ మావి అన్నట్టుగా అడ్వాన్స్ అక్విటెన్స్‌లు తీసుకుంటున్నారు. ఇటీవల చాలా మంది లెక్చరర్ల ద్వారా ఇలాగే తీసుకున్నారు. జీవో 128 మేరకు అడ్వాన్స్ అక్విటెన్స్ అవసరం లేదని కళాశాల ఉన్నతాధికారులకు చెప్పినా, ట్రెజరీలో ఎస్టీఓ ఒప్పుకోవడం లేదని కుంటిసాకులు చెబుతూ...కాంట్రాక్టు లెక్చరర్ల జీతాలకు కొర్రీలు వేస్తున్నారు. అక్విటెన్స్ కాపీలు ఇవ్వని వారికి జీతాలు నిలిపేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 4 నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదు. ఒక లెక్చరర్‌కు జూన్ 2024 నుంచి సెప్టెంబరు 2024 వరకూ చెల్లించలేదు. నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కళాశాల ఉన్నతాధికారులపై కాంట్రాక్టు లెక్చరర్లు మండిపడుతున్నారు.

మాకు నాన్ టీచింగ్ స్టాఫ్ లేరు

మా కళాశాలలలో నాన్ టీచింగ్ స్టాఫ్ లేరు. డీడీఓగా నా బాధ్యతలు నాకుంటాయి. నాకు పని ఒత్తిడి ఉంటుంది. కాంట్రాక్టు లెక్చరర్లకు టైంకి జీతాల బిల్లులు పెడుతున్నాం. అక్విటెన్స్ లేకుంటే ట్రెజరీలో రిజెక్ట్ చేసే అవకాశం ఉంది. అందుకే అడ్వాన్స్ అక్విటెన్స్ తీసుకుంటున్నాం. గత కొంత కాలంగా ఇలాగే చేస్తున్నాం.

- రామకృష్ణ, ప్రిన్సిపాల్, డిగ్రీ కాలేజ్, ఉరవకొండ

ప్రయాణం.. నరకం..!

- రోడ్ల అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..



ఇరగంపల్లి నుంచి తలమర్లకు వెళ్లే రహదారి

కొత్తచెరువు, అక్టోబరు 8: గ్రామాల ప్రగతిలో రహదారుల పాత్ర కీలకం. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధిని మరిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక వాహనాలు అదుపు తప్పడంతో వాహనచోదకులు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇక వర్షాకాలంలో ఈ రోడ్ల పరిస్థితి దేవుడికే ఎరుక. బురదమార్గాల్లో అడుగుతీసి అడుగు వేయలేనిదుస్థితి.



కొత్తచెరువు నుంచి గోరంట్లపల్లికి వెళ్లే రహదారి దుస్థితి

ప్రయాణం చేయాలంటే..తిప్పలుతప్పవ్

ఇరగంపల్లి నుంచి తలమర్లకు వెళ్లే రహదారి, మరుకుంటపల్లి నుంచి పోతులకుంట వెళ్లే రహదారి కంకరతేలి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాళ్లు తేలి గుంతలు ఏర్పడ్డాయని, దీంతో మండల కేంద్రానికి చేరుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నామని వాపోతున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తీరా తారురోడ్డు వేసే సమయంలో వైసీపీ ప్రభుత్వం రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అనంతరం ఆ ప్రభుత్వం ఐదేళ్లూ రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు అంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా తారురోడ్డు సౌకర్యం కల్పించాలని తలమర్ల, మీర్జాపురం, పోతులకుంట, మరుకుంటపల్లి పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల నిర్మాణం మరిచిన గత వైసీపీ ప్రభుత్వం

2014లో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కొత్తచెరువు నుంచి గోరంట్లపల్లికి వెళ్లే 3 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.4కోట్లు నిధులు మంజూరు చేయించారు. చిత్రావతి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి సైతం నిధులను మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం మారడంతో తిరిగి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అక్కడక్కడ కల్వర్టులు, మట్టి రోడ్డు వేయించారు. అయితే వైసీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. ఈ రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సైతం ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. ఇటీవల కొత్తచెరువు, గోరంట్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డికి రహదారి సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు స్పందించి తమ గ్రామాలకు తారు రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

నల్లబ్యాడ్జీలతో ఈయూ నిరసన

ధర్మవరం, అక్టోబరు 8: 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయకుండా 70,71 సర్క్యులర్ పేరిట ఉద్యోగులను మానసికంగా పనిష్మెంట్ల రూపంలో వేధిస్తున్నారని ఎంప్లాయీస్ యూనియన్ సత్యసాయిజిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి అన్నారు. మూడవ రోజు మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఈయూ నాయకులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏ డిపోలోలేని ఓటీ శాతం ఒక్క ధర్మవరంలోనే అధికంగా 47శాతం ఉందన్నారు. పనిభారాన్ని పెంచి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సంఘం డిపో కార్యదర్శి ముస్తఫా, ఏడీసీలు మల్లికార్జున, టీఎస్ మూర్తి, బాబు, తిరుమలేశు, జీపీ రెడ్డి, శీన పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి రమా

తనకల్లు, అక్టోబరు 8: స్థానిక గ్రంథాలయాన్ని మంగళవారం ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ సెస్‌కు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు సెస్ వసూలు చేయాలని గ్రంథాలయ అధికారి మస్తాన్‌వలీకి సూచించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు.

తహసీల్దార్ కార్యాలయం...

కొత్తచెరువు, అక్టోబరు 8: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామస్థులు శ్మశానవాటిక లేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తహసీల్దార్ నీలకంఠారెడ్డిని వెంటనే స్థల సేకరణ చేసి గ్రామ పంచాయతీకి అందించాలని ఆమె ఆదేశించారు. తహసీల్దార్ ఇదివరకే పుట్టపర్తి రహదారి పక్కన నల్లగొండ సమీపంలో భూ సేకరణ చేశామని ఆర్డీఓకు వివరించారు. అయితే ఆ భూమిని గతంలో కొంతమందికి పట్టాలు ఇచ్చారని, వారితో గ్రామసభ ఏర్పాటుచేసి వారి నుంచి స్థలాన్ని సేకరించి, శ్మశానవాటికకు కేటాయిస్తామన్నారు. ఆర్డీఓ వెంట డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు ఉన్నారు.

సకాలంలో బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీఎం రవీంద్ర

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 8: మహిళా సంఘాల సభ్యులు సకాలంలో తీసుకున్నరుణాలను చెల్లించాలని వెలుగు ఏపీఎం రవీంద్ర సూచించారు. మంగళవారం మండలంలోని బసప్పగారిపల్లిలో శ్రీదుర్గా వీఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బకాయి ఉన్న శ్రీనిధి రుణాలను త్వరగా చెల్లించి, మరిన్ని రుణాలు పొందాలన్నారు. అనంతరం సంఘాల లావాదేవీలు గురించి సమీక్షించారు. ఆయనతో పాటు వెలుగు సీసీ రమణ, జిల్లా మాజీ అధ్యక్షురాలు ఈశ్వరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వృత్తివిద్యా శిక్షణ కోర్సులు



ద్విచక్రవాహన మరమ్మతులపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కదిరి అర్బన్, అక్టోబరు 8: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వృత్తివిద్యా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు లియాకత్‌ఆలీ తెలిపారు. శిక్షణలో భాగంగా ఆటోమోటివ్ విభాగంలో 12 రోజులు ఇంటర్న్‌షిప్‌పై శిక్షణను నిర్వహిస్తున్నామన్నారు. 28 మంది విద్యార్థులకు స్థానికంగా ఉన్న ద్విచక్రవాహన మరమ్మతులపై వివరించారు. మంగళవారం స్థానిక హోండా షోరూమ్, గ్యారేజీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు పరిశీలించారు. వివిధరకాల వృత్తులపై అవగాహన కలిగి ఉండడంతో స్వయం ఉపాధి దిశగా రాణించేందుకు అవకాశముంటుందని ఉపాధ్యాయురాలు లావణ్య పేర్కొన్నారు.

నేడు రైతు క్షేత్ర దినోత్సవం

తనకల్లు, అక్టోబరు 8: మండలపరిధిలోని కొత్తకురవపల్లి(గొల్లపల్లి) గ్రామంలో బుధవారం క్షేత్రస్థాయి దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామానికి చెందిన రైతులు వెంకటరమణ, చలపతి, సురేష్, సూర్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈఖరీఫ్‌లో వివిధ రకాల చిరుధాన్య పంటలను సాగుచేశామన్నారు. పంటలు బాగా పండడంతో రైతు క్షేత్రదినోత్సవం నిర్వహించనుననట్లు చెప్పారు. మండలస్థాయి అధికారులతో పాటు, జనజాగృతి, వాసన్, ఏపీమాస్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరవుతారన్నారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నాలని వారు కోరారు.

వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం

పుట్టపర్తి, అక్టోబరు 8: విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రశాంతినిలయంలో మూడో రోజు మంగళవారం వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞాన్ని పండితులు ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు పూర్ణచంద్రహాల్‌లో వేద మంత్రోచ్ఛారణల నుడమ యజ్ఞాన్ని ప్రారంభించారు.రుత్వికులు మొదట మహాగణపతి పూజతో మొదలుపెట్టి సూర్యనమస్కారం, సర్వదేవతార్చన నిర్వహించారు. మొదటి రోజు యజ్ఞాన్ని వీక్షించడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వారంరోజుల పాటు యజ్ఞాన్ని కొనసాగించి విజయదశమి రోజున పూర్ణాహుతితో ముగిస్తారు. సాయంత్రం సాయికుల్వంతు సభా మంటపంలో ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

కదిరి, అక్టోబరు 8: కదిరి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను బదిలీ చేసినట్లు ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు అందాయి. కిరణ్‌కుమార్‌ను మాతృ శాఖ అయిన హార్టికల్చర్‌కు బదిలీ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. కిరణ్‌కుమార్ సార్వత్రిక ఎన్నికల ముందు పుంగనూరునుంచి బదిలీపై కదిరికి వచ్చారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.



ఏపీఎంగా నారాయణ

కొత్తచెరువు, అక్టోబరు 8: కొత్తచెరువు మండల వెలుగు ఏపీఎంగా నారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం రవీంద్రారెడ్డిని పుట్టపర్తికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గోరంట్లలో పనిచేస్తున్న ఏపీఎం నారాయణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగానే పట్టాలు సాధించుకున్నాం

- ప్లంబర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు



మాట్లాడుతున్న ప్లంబర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర

ధర్మవరం, అక్టోబరు 8: పొట్టకూటి కోసం రేయింబవళ్లు కష్టపడి పనిచేసే ప్లంబర్ వృత్తిమాది... అయితే కొందరు వ్యక్తులు కోర్టుకు వెళ్లడంతో 2022లో ప్లంబర్స్ అసోసియేషన్‌కు ఆ భూమిని కేటాయిస్తూ కోర్టు తీర్పనివ్వడంతో ప్రభుత్వ పెద్దల సహకారంతో ఉన్నభూమిని పంచుకున్నామని ఆ సంఘం ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని 650-2 సర్వే నంబర్‌లో 20 సంవత్సరాల క్రితం ప్లంబర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వం స్థలం కేటాయించిందన్నారు. కొందరు వ్యక్తులు కోర్టుకు వెళ్లడంతో అప్పటి నుంచి పెండింగ్ పడుతూ 2022లో హైకోర్టు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. తీర్పు అనంతరం అప్పటి ఆర్డీఓ ప్రతిపాదలకు అసోసియేషన్‌ను పిలిపించి రాజీచేసి కలిసి ముందుకు వెళ్లాలని సూచించడంతో అందుకు సమ్మతించామన్నారు. మొదట్లో 53 మందికి పట్టాలు ఇవ్వగా ఒక్కొక్కరికి రెండున్నర నుంచి 3 సెంట్లు వరకు కేటాయించామన్నారు. ఈ 20 ఏళ్లలో ఆ భూమిని కొందరు కబ్జాచేయగా మిగిలిన 1.34 ఎకరాల్లో ఒక్కొక్కరికి 1.25 సెంట్లు చొప్పున పంచగా ప్లంబర్స్‌లోని కొందరు ముఖ్యులు 20 ఏళ్ల నుంచి కోర్టు ఖర్చులు భరించడంతో వారికి మాత్రం రెండుపట్టాలు చొప్పున ఇచ్చామన్నారు. సాధారణంగా ఎవరైనా సమస్యలు పరిష్కరించుకోవాలంటే అధికార పార్టీ నాయకులను సంప్రదిస్తారన్నారు. అందులోభాగంగానే టీడీపీ, వైసీపీ నాయకులను కలిసిన్యాయం చేయాలని కోరామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా న్యాయఅన్యాయాలను విచారించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. కార్యదర్శి రాజు, జాయింట్ సెక్రటరీ లదీప్, కోశాధికారి ఇస్మాయిల్, జుబేర్, సభ్యులు జాహీద్, చంద్ర, వీరారెడ్డి, అంజి, కిష్ట, మాధవ, జిలాన్, బాషా, హసీమ్, అనిల్‌కుమార్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వర్షం లేక ఎండిన వేరుశనగ పంట: ఏఓ



మాట్లాడుతున్న ఏఓ లోకేశ్వర్‌రెడ్డి

నంబులపూలకుంట, అక్టోబరు 8: ఊడదశలో వర్షాలు కురవకపోవడంతోనే వేరుశనగ పంట ఎండిపోయిందని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాము అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీఓ మనోహర్‌బాబు ఆజెండాను చదివి వినిపించారు. ఏఓ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆరువేల ఎకరాల్లో వేరుశనగ పంటను సాగుచేశారన్నారు. ఊడగదశలో వర్షం రాకపోవడంతో పంట ఎండుదశకు చేరిందన్నారు. ఇటీవల కురిసినా పంట దిగుబడి లేదన్నారు. ట్రాన్స్‌కో ఏఈ సాలేహాబాషా మాట్లాడుతూ రైతులకు అవసరమైన పరికరాలను అందించడానికి ప్రతిపాదనలు సిద్ధంచేశామన్నారు. ప్రత్యేకాధికారి సురేంద్ర, ఈఓఆర్డీ మాధవరెడ్డి, వైద్యాధికారి ఆసియా, ఎంఈఓ సుబ్బిరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, హౌసింగ్, పట్టుపరిశ్రమ, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాడిమర్రి: అభివృద్ధి పనులపై చర్చించాల్సిన మండల సర్వసభ్యసమావేశంలో ఎలాంటి తీర్మానాలు చేయకుండానే ముగించేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ భువనేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారి గ్రామాలు, శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి, నిధుల వినియోగం గురించి మాత్రమే చర్చించారు. 11 గంటలకు ప్రారంభమైన సమావేశాన్ని 1 గంటకే ముగించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



రామలక్ష్మమ్మ (ఫైల్)

కదిరి, అక్టోబరు 8: అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ సమీపంలోని సుబ్బయ్యనారవద్ద మామిడి వనంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు విజయవాడలో ఏఎస్ఐగా పనిచేస్తున్న క్రిష్ణమూర్తికి చెందిన మామిడి తోటలో పెనుకొండకు చెందిన రామలక్ష్మమ్మ(34) ఏడాదిగా కాపలా ఉంటోంది. మంగళవారం రామలక్ష్మమ్మ కుమారుడు పురుషోత్తం ఆమెను చూడడానికి తోట వద్ద ఉన్న గది వద్దకు వెళ్లాడు. తల్లి ఒంటిపై రక్తగాయాలతో విగతజీవిగా పడి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కదిరి డీఎస్పీ శివనారాయణ, ఎస్ఐ వెంకటనారాయణ, సిబ్బంది సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. గది ఆవరణలో, పారకు రక్త మరకలుండటంతో డాగ్ స్క్వాడ్‌ను డీఎస్పీ రప్పించారు. ఆమె మృతికి గలకారణాలు విచారణలో తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోర్టుమార్టం నిమిత్తం కదిరికి తరలించి. కేసుమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.



డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శివనారాయణ

బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం ఖాళీ..!

- సిబ్బంది లేక ఎక్కడి సమస్యలు అక్కడే
- కార్యాలయం చుట్టూ ప్రజల ప్రదక్షిణ



బత్తలపల్లి, అక్టోబరు 8: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తోంది. అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖలో సిబ్బంది ఉన్నా ప్రజా పనులు జరగడం లేదు. అలాంటిది ఈ కార్యాలయంలో కీలకమైన అధికారుల పోస్టులు భర్తీచేయకపోవడంతో ప్రజా సమస్యలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల ఒత్తిళ్లు తట్టుకోలేక చాలా మంది అధికారులు సెలవుపై వెళ్లి మరో చోటికి బదిలీ చేయించుకున్నారు. కార్యాలయంలో ఆర్ఐ2 ఐదేళ్లు, ఆర్ఐ1 రెండేళ్లుగా లేరు. రెండేళ్లుగా డీటీ పోస్టు ఖాళీ. ముష్టూరు, అప్రాచెరువు వీఆర్ఓలు రెండు సంవత్సరాలుగా లేరు. అప్పటి నుంచి నేటి వరకు ఆయా అధికారుల కుర్చీలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. అప్పట్లో ఖాళీలను భర్తీ చేయాల్సిన అప్పటి వైసీపీ నాయకుల మాట కాదని నియమించలేదు. దీంతో మండలంలోని ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారానికి కార్యాలయం చుట్టూ నేటికీ తిరుగుతూనే ఉన్నారు. రైతులు బాధలు చూడలేక కొంత మంది వీఆర్ఓలు ఆర్ఐ చేయాల్సిన పనులు వారే చేసి పంపుతున్నారు. డీటీ చేయాల్సిన పనులు కిందిస్థాయి ఉద్యోగులే చేయాల్సి వస్తోంది. దీంతో పనిభారం అవుతోందని కిందిస్థాయి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇటీవల తహసీల్దార్‌గా స్వర్ణత బాధ్యతలు చేపట్టారు. మిగిలిన అధికారులు కూడా వీలైనంత త్వరగా అధికారులు నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

సరస్వతీదేవిగా గాయత్రీమాత..!

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. పుట్టపర్తిలో సరస్వతీదేవిగా గాయత్రిమాత, ధర్మవరంలో గౌరీదేవిగా చౌడేశ్వరీదేవి, కదిరిలో రాజరాజేశ్వరిగా చౌడేశ్వరిదేవి, ముదిగుబ్బలో సుబ్రహ్మణ్యేశ్వరుడిగా వాసవీమాత, కొత్తచెరువులో మహాలక్ష్మిగా రేణుకాయల్లమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.

- న్యూస్ నెట్‌వర్క్



పుట్టపర్తి: సరస్వతీదేవిగా గాయత్రీమాత



కదిరి: రాజరాజేశ్వరిగా చౌడేశ్వరీదేవి



ముదిగుబ్బ: సుబ్రహ్మణ్యేశ్వరుడిగా వాసవీమాత



ధర్మవరం: గౌరీదేవిగా చౌడేశ్వరీదేవి

మంత్రి సత్యకుమార్‌కు కృతజ్ఞతలు

ధర్మవరం, అక్టోబరు 8: ధర్మవరంలో చేనేత క్లస్టర్ ఏర్పాటుచేసి నేతన్నలలో ఆశలు చిగురింపచేస్తున్న వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చేనేత ప్రముఖులు గిర్రాజు నగేశ్ తెలిపారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత పరిశ్రమ అడుగంటిపోతున్న తరుణంలో మంత్రి తీసుకుంటున్న నిర్ణయాల వల్ల నేతన్నలకు మళ్లీ ఊరట లభించనుందన్నారు. సత్యసాయిజిల్లాలో 28,500 చేనేత కుటుంబాలుండగా ఇందులో ధర్మవరం పట్టణంలో 12,800 చేనేత పరిశ్రమ మనుగడపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గతంలో చేనేత క్లస్టర్ వల్ల ఒక్కోక్లస్టర్ నుంచి 200 చేనేత కార్మికులు వృత్తినైపుణ్యం, శిక్షణ తీసుకుని పట్టుచీరను అందంగా తయారుచేసే పరిస్థితి ఉండేదని, మరమగ్గాల రాకతో పూర్తీగా పరిశ్రమ తుడుసుకుపెట్టుకుపోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి గత టీడీపీప్రభుత్వ హయాంలో ముడిపట్టుపై కిలోకు రూ.500 చొప్పున రూ.2వేలు బ్యాంకు ఖాతాకు జమచేసేవారని, గత వైసీపీప్రభుత్వం ఆ పథకాన్ని రద్దుచేయడం వల్లనేతన్నలకు తీవ్ర ఇబ్బందులు కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ధర్మవరంలో తయారు చేసిన చీరలను కంచిపట్టుచీరలుగా మార్కెట్‌లో ఉంచి మన ధర్మవరం ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

రైతుసేవా కేంద్రాలుగా మారేదెన్నడో..?



లోచర్లలోని రైతుభరోసా కేంద్రం

కొత్తచెరువు, అక్టోబరు 8: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమిప్రభుత్వం కొలువు తీరి నాలుగునెలలు కావస్తున్నా రైతు సేవా కేంద్రాలు అలానే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)పేరును కూటమి ప్రభుత్వం రైతుసేవా కేంద్రాలుగా మార్చింది. అయితే మండలంలోని తలమర్ల, లోచర్ల తదితర గ్రామాల్లో ఉన్న ఆర్‌బీకే కేంద్రాల పేర్లు ఇప్పటివరకు అలాగే ఉన్నాయి. దీంతో రైతులు, నాయకులు, అధికారులు కార్యాలయాలకు పేరు మార్చకపోవడంతో విమర్శలువినిపిస్తున్నాయి.

చీడపీడల నివారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

బుక్కపట్నం, అక్టోబరు 8: చీడపీడల నివారణపై మండలంలోని మారాల గ్రామంలో రైతులకు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త రామసుబ్బ, ఏఓ సతీష్‌బాబు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ మొక్కజొన్న, వేరుశనగలో వచ్చే చీడపీడల నివారణపై వివరించారు. ఉద్యాన పంటలైన మామిడిలో పురుగు నివారణపై అవగాహన కల్పించారు. ఉద్యానశాఖాధికారి నవీన్‌కుమార్, ఏఈఓలు సునీత, సుధాలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం, అక్టోబరు 8: ముస్లిం మైనార్టీల సంక్షేమమే లక్ష్యమని ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ దాదాపీర్ పేర్కొన్నారు. మంగళవారం ధర్మవరంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ముస్లిం మైనార్టీల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. సభ్యులు తహీర్‌షేర్, ఖాదర్‌వలీ, జిక్రయా పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

అనంతపురం క్రైం, అక్టోబరు 8 : నగర శివారులో ఐషర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డికి చెందిన హాజీవలి(18)ఇంటర్ చదువుతున్నాడు. అతడు మంగళవారం ఉదయం ప్రధాన రహదారిలో వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఐషర్ వాహనం ఢీ కొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన హాజీవలిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

అనంతపురం క్రైం :ఏడేళ్ల బాలికపై అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిని అనంతపురం రూరల్ పోలీసులు రిమాండ్‌కు పంపారు. నగరంలోని జాకీర్ కొట్టాలకు చెందిన రవీంద్ర సోమవారం ఏడేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. అతడిని మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

అమరాపురం, అక్టోబరు 8 : మండల పరిధిలోని బసవనపల్లిలో మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనానికి లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన మేరకు.. బసవనపల్లి గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో కర్నాటక రాష్ట్రం పావగడ తాలూకా నిడిగల్లు హోబళి చిక్కబొమ్మనహళ్లి గ్రామానికి చెందిన తిప్పేస్వామి(48) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం దుకాణాలకు 127 దరఖాస్తులు

పెనుకొండ, అక్టోబరు 8 : పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 13 మద్యం దుకాణాలకు మంగళవారం నాటికి 127 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. మంగళవారం ఒక్కరోజే 36 దరఖాస్తులు అందినట్లు ఆయన చెప్పారు. బుధవారానికి దరఖాస్తులు దాఖలు చేయడానికి ఆఖరు రోజు అన్నారు. ఎక్సైజ్ స్టేషన్‌వద్ద దరఖాస్తులు వేయడానికి వచ్చేవారు ఎలాంటి గొడవలకు దిగకుండా సీఐ రాఘవన్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పాల ట్యాంకర్ బోల్తా



బోల్తాపడిన పాల ట్యాంకరు

పెనుకొండ రూరల్, అక్టోబరు 8 : పెనుకొండ-మడకశిర రహదారిలోని మావటూరు వద్ద మంగళవారం పాల ట్యాంకర్ బోల్తాపడింది. పెనుకొండ నుంచి మడకశిర వైపు వెళ్తున్న ఖాళీ పాల ట్యాంకర్ మావటూరు సమీపం వద్దకు వెళ్లగానే మలుపువద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీసి పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వర్షాలకు కూలిన ఇళ్లు



పడిపోయిన ఇంటివద్ద బాధితురాలు, పిల్లలు

అగళి, అక్టోబరు 8 : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఇరిగేపల్లి, నందరాజనపల్లిలో పేదలకు చెందిన రెండు ఇళ్లు కూలిపోయాయి. ఇంటిలో నివసిస్తున్న లలితమ్మ, ఇద్దరు పిల్లలు బయట వేరేచోట పడుకోవడంతో పెద్ద గండం నుంచి తప్పించుకున్నారు. నందరాజనపల్లిలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు గొల్ల తిమ్మక్క ఇల్లు కూడా సోమవారం రాత్రి పడిపోవడంతో కొంచెంలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇద్దరి ఇళ్లలో మగవారు లేరు. ఇప్పుడు రెండు కుటుంబాలకు ఇల్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ లక్ష్మి, నాయకులు శ్రీనివాస్, మంజు చరణ్, మంజు, హరీష్ ధైర్యం చెప్పారు. త్వరలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామితో మాట్లాడి ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

స్థల వివాదం.. బండలు ధ్వంసం

గోరంట్ల, అక్టోబరు 8: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న దాదాపు 40 సెంట్లు వివాద స్థలంలో నాటిన బండరాళ్లను శంకర్‌రెడ్డి వారసులు మంగళవారం పగలకొట్టారు. శంకర్‌రెడ్డికి చెందిన ఎకరా స్థలంలో కుమారుడు మంజునాథ్‌రెడ్డి కొంత విక్రయించారు. అనంతరం ఆయన మరణించగా, ఆ స్థలాన్ని కొనుగోలు చేసిన కరావులపల్లికి చెందిన వైసీపీ నాయకుడు గంపల రమణారెడ్డి అదే గ్రామానికి చెందిన చింతా గోపాల్‌రెడ్డి ఇద్దరు స్థలం తమదేంటూ కొన్నేళ్లుగా గొడవలు పడి, చివరికి వారు రాజీ అయ్యారు. వివాద స్థలాన్ని కరావులపల్లి వాసులు గోరంట్లకు చెందిన ఉమ్మర్‌ఖాన్‌కు విక్రయించారు. దీంతో స్థలం చుట్టూ రాతి బండలను నాటించి చదును చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఇళ్లు, దుకాణాలవారికి దారిలేక అసౌకర్యం ఏర్పడింది. ఆగ్రహించిన శంకర్‌రెడ్డి వారసులు బండరాళ్లను పగలకొట్టారు. దీనిపై గంపల రమణారెడ్డి, చింతా గోపాల్‌రెడ్డి, ఉమ్మర్ ఖాన్ ఎస్‌ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

పెనుకొండ రూరల్, అక్టోబరు 8: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుంటే శిశువు ఆరోగ్యవంతంగా జన్మిస్తుందని డాక్టర్ నాగరాజునాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భవతులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేంద్రానికి వచ్చిన గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు అందించారు. గర్భవతులు, బాలింతలకు ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ సవిత ఆధ్వర్యంలో రెండేళ్లుగా అన్నదానం చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హిందూపురం అర్బన్, అక్టోబరు 8: పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో నూతనంగా నిరిస్తున్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి అమెరికాలో ఉంటున్న ప్రకాష్ రూ.2,01,116 విరాళంగా అందించారు. మంగళవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి నిమ్మకాయల రాము, డైరెక్టర్ చంద్రమోహన్‌కు చెక్కు అందించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. హిందూపురంవాసులే కాకుండా ఇతర ప్రాంతాలవారు విరివిగా స్పందిస్తున్నారన్నారు.



చెక్కును అందిస్తున్న దాతలు

ప్రమాదాలకు నిలయం.. హైవే



నిత్యం ప్రమాదాలు జరుగుతున్న హైవే జంక్షన్

అగళి, అక్టోబరు 8 : అగళి హైవే జంక్షన్‌లోని నిత్యం రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. జాతీయ రహదారి-544 ప్రారంభించినప్పటి నుంచి నాలుగు రోడ్ల మధ్యలో ఇప్పటికే ఏడెనిమిది ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. హైవేలో స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలు లేకపోవడంతో కార్లు స్పీడ్‌గా వచ్చి ద్విచక్రవాహనాలను ఢీకొంటున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణం. రొళ్ల హైవే నుంచి పి. బ్యాడిగెర వరకు ప్రమదాలు అధికంగా జరుగుతున్నాయి. ప్రాణనష్టాలు కూడా అధికంగా జరిగాయి. పి.బ్యాడిగెర వద్ద వడగుంటహళ్లి గ్రామానికి చెందిన వ్యక్తికి కారు ఢీకొని మృతి చెందాడు. ఇరిగేపల్లి హైవే మలుపు దగ్గర సిమెంటు లారీ ఢీకొని ప్రాణ నష్టం జరిగింది. కసాపురం గ్రామానికి చెందిన ఎద్దుల బండిలో ఇసుక తోలుకుని తెల్లవారుజామున వెళ్తుండగా రొళ్ల వైపు నుంచి ఐచర్ వాహనం ఢీకొని ఎద్దులతోపాటు ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఇలా అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, కాళ్లు చేతులు విరగడం వంటి ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హైవే కూడలిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

సోమందేపల్లి, అక్టోబరు 8: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. సోమందేపల్లి జాతీయ రహదారిలో గాయపడి పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తికి మంగళవారం పోలీసులు మున్సిపల్ కార్మికుల సహాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇతడు రెండ్రోజుల క్రితం సోమందేపల్లికి చెందిన చేనేత ఫ్యాక్టరీ వద్ద జాతీయ రహదారిపై గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతిచెందాడు. మృతుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు పత్రికా ప్రకటనను ఇచ్చారు. బంధువులు ఎవరూ రాకపోవడంతో ఏఎస్‌ఐ మురళి మున్సిపల్ కార్మికుల సహాయంతో శ్మశానవాటికలో దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. విధుల్లో తమవంతు పాత్ర పోషిస్తూనే మరోవైపు మానవత్వాన్ని చాటుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలిచారు.

యథేచ్ఛగా తరలుతున్న ఇసుక



అక్రమంగా ట్రాక్టరులో తరలుతున్న ఇసుక

మడకశిర రూరల్, అక్టోబరు 8: మండలంలోని కేతేపల్లి సమీపంలో జయమంగళి నది నుంచి రాత్రిపూట ట్రాక్టర్లతో ఇసుకను కర్ణాటకకు తరలిస్తున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోలేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతి రోజు రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకు ఇసుక తరలిపోతోంది. అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తప్పవని తెలిపారు. ఇసుక అక్రమంగా తరలించే వారిపై గట్టి నిఘా ఉంచినట్లు వివరించారు.

కరుణించు తల్లీ.. కనకదుర్గమ్మా..!






హిందూపురంలో కాత్యాయినీదేవిగా కొల్హాపురిలక్ష్మి, అలంకరణలో జలదుర్గమ్మ, పెనుకొండలో వారాహిదేవిగా కన్యకాపరమేశ్వరి, మడకశిరలో ఈరకేతమ్మదేవికి ప్రత్యేక అలంకరణ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయాల్లో అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణ చేశారు. హిందూపురం పట్టణం సూరప్పకట్ట వద్ద ఉన్న మధుగిరి మారియమ్మ ప్రత్యేంగినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాత మిగిలాంబికదేవిగా కొలువుదీరారు. కొల్హాపురమ్మ ఆలయంలో అమ్మవారు కాత్యాయినీ దేవిగా రూపుదిద్దుకున్నారు. సాధుచెట్టి సంఘం ఆధ్వర్యంలో జలదుర్గమ్మకు ద్రాక్షపండ్లతో ప్రత్యేక అలంకరణగా నిలిచారు. పెనుకొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి వారాహిదేవి అలంకరణ చేశారు. చంద్రగిరి మహేశ్వరి శక్తిపీఠం ఆలయంలో అమ్మవారికి కుంకుమతో లలిత మహేశ్వరిగా అలంకరించారు. పరిగిలో హొన్నదేవి కొల్లపుర మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మడకశిరలో కన్యకాపరమేశ్వరిని మహాలక్ష్మీదేవి అలంకరణలో కొలువుదీర్చారు. కొల్లాపురమ్మ, వడిసిలమ్మ, గంగాపూజమ్మ, ఊరిమారమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్లుమర్రి ఈరకేతమ్మదేవి, చందకచర్ల గంగమ్మ మెళవాయి చౌడేశ్వరిదేవి ఆలయాల్లో అభిషేకాలు చేయించారు. గుడిబండలో వెలిసిన తుమ్మలమారమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాగు రైతులకు హక్కులు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పావగడ, అక్టోబరు 8 : బీడు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు భూ హక్కులు కల్పించాలని బీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ హరిరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం పావగడలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి ర్యాలీగా వస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అక్కడ ధర్నా చేపట్టారు. ప్రభుత్వం బీడు భూములను సాగుచేసిన రైతులకు న్యాయం దక్కేలా చేయాలని తహసీల్దార్, ఎమ్మెల్యే చొరవ తీసుకొని వారికి పట్టా పుస్తకాలు వచ్చేలా కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో తహసీల్దార్‌ను హైకోర్టు వరకు రప్పించి అక్కడే సమస్యలు పరిష్కరించుకొంటామని ఆయన హెచ్చరించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వరదరాజుకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కెంచరాయ, నాయకులు ఈరన్న, హనుమంతరాయ, తిప్పేస్వామి, గోపీ, చెన్నకేశవ, గోవింద తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు తరలిరండి

పావగడ, అక్టోబరు 8 : ఈనెల 11, 12 తేదీల్లో తుమకూరులో జరిగే చారిత్రాత్మక దసరా ఉత్సవాలకు తాలూకా నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని తహసీల్దార్ వరదరాజు పిలుపునిచ్చారు. తాలూకా కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైసూరు దసరా ఉత్సవాల మాదిరిగానే తుమకూరులో కూడా అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఉత్తర కర్ణాటకలోని కన్నడ కళాభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. దసరా ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ క్యాలెండర్లను తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకిరామ్, మున్సిపల్ ముఖ్య అధికారి జాఫర్ షరీఫ్ తదితరులు కలిసి విడుదల చేశారు.

మహంకాళి ఆలయానికి పూర్వవైభవం



ప్రత్యేక అలంకరణలో మహంకాళి అమ్మవారు

పెనుకొండ, అక్టోబరు 8 : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటాపురం తండాలో పొలాల మధ్య శిథిలావస్థకు చేరుకున్న మహంకాళి ఆలయాన్ని ప్రజల సహకారంతో జీర్ణోద్ధారణ పనులు చేపట్టి పూర్వవైభవం తీసుకు వచ్చారు. ఆలయ అర్చకులు వెంకటేశులు, పంచాంగం శేషప్పస్వామి, బోయసంజీవప్ప, వెంకి ఆధ్వర్యంలో ఆలయ జీర్ణోద్ధారణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆలయం నిత్యపూజలతో భక్తులను ఆకట్టుకుంటోంది. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

భైరవ కాళికా ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భైరవ కాళికా మాత

పెనుకొండ టౌన్, అక్టోబరు 8: లక్ష్మీనరసింహస్వామి కొండపై వెలసిన భైరవ కాళికా ఆలయంలో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పరంధామయ్యరెడ్డి, హేమంత్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని 10న గణపతిపూజ, నవగ్రహపూజ, 11న అభిషేకం, ఆయుధపూజ, వాహన పూజ, తదితర కార్యక్రమాలు, 12న అభిషేకం, లలితసహస్రనామపూజ మహామంగళహారతి తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కొండపైకి రోడ్డు సౌకర్యం కూడా ఉందని, పెద్దఎత్తున భక్తులు పాల్గొని కాళికామాత అనుగ్రహాన్ని పొందాలన్నారు.

చిరు ధాన్యాలతోనే అధిక దిగుబడులు

పెనుకొండ రూరల్, అక్టోబరు 8 : చిరుధాన్యాల సాగుతో తక్కువ దిగుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చని మండల వ్యవసాయ అధికారి చందన పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మావటూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వేరుశనగలో విత్తనశుద్ధి, అంతర్‌పంట, కంచెపంట, ఆకర్షపు పంట కలుపు మందుల ఆవశ్యకతపై వివరించారు. రైతులు ఎక్కువగా చిరుధాన్యాలపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అశోక్‌కుమార్, ఆర్బీకే సిబ్బంది, టీడీపీ నాయకులు గోపాల్, నాగరాజు పాల్గొన్నారు.



మావటూరులో పొలంబడిలో వ్యవసాయాధికారులు, టీడీపీ నాయకులు

గోరంట్ల : మండలలోని పాలసముద్రం గ్రామంలో వ్యవసాయాధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కందిపంటకు సకాలంలో పురుగుమందులు చల్లి చీడపీడలను నివారించాలని ఏఓ మునిక్రిష్ణ వివరించారు. పూత, పిందే దశలో ఉండడంతో సస్యరక్షణ చర్యలు ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీరాములు, సిరికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు మల్లికార్జున, రామానాయక్, టీడీపీ నాయకులు జయచంద్ర, మనోహర్, మూరి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అమరాపురం : మండలంలోని హేమావతి గ్రామ పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరై వారి శాఖల పరిధిలో జరుగుతున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. ఏఓ మంజునాథ్, సెరికల్చర్ అధికారి వేణుగోపాల్, రైతు సేవా కేంద్రాల సహాయకులు, నాయకులు జయకుమార్, రామచంద్రప్ప, ఓంకార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : కంది, రాగి, వేరుశనగ పంటల సాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ వీరనరేష్ పేర్కొన్నారు. మండలంలోని గుడిబండ, దేవరహట్టి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ని ర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓలు హేమలత, శారదమ్మ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ రూరల్, అక్టోబరు 8 : రొద్దం మండలం దొడగట్ట గ్రామంలో మంగళవారం గంగమ్మజాతరను వైభవంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం గ్రామదేవత గంగమ్మకు ప్రతియేటా ప్రత్యేకంగా అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం జంతు బలులు ఇచ్చారు. జాతరకు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

రొద్దం మండలం ఆర్. మరువపల్లి ఎంజేపీ పాఠశాలలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ప్రిన్సిపాల్ అనిత ఎంపీ బీకే పార్థసారథిని కోరారు. ఆమె ఎంపీని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎంజేపీ పాఠశాలలో సమస్యలను వివరించారు. ఎంపీ స్పందిస్తూ డ్రైనేజీ మరమ్మతుల, పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

బీకేను కలిసిన వివిధ శాఖల అధికారులు



ఎంపీని సన్మానిస్తున్న ఆర్ఎం, డీఎం

పెనుకొండ, అక్టోబరు 8 : హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథిని మంగళవారం ఆయన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. పెనుకొండ పంచాయతీ రాజ్‌శాఖ డీఈ తిరుపాల్‌రెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందించారు. శ్రీసత్యసాయిజిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ మధుసూదన్, పెనుకొండ డిపోమేనేజర్ రామసుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈనెల 12న డిపోనకు వచ్చిన కొత్త బస్సుల ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. టేకులోడు ఏపీఎంజేపీ ప్రిన్సిపాల్ శోభరాణి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా సాదర గౌడ నాయకులు పూలమాలలు వేసి సత్కరించారు. తమ కులస్థులను వెనుకబడిన తరగతులుగా, ఓబీసీగా గుర్తించాలని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బీకేను కోరారు.

మాదిగలను బలోపేతం చేయాలి



ఐక్యత చాటుతున్న ఎంహెచ్‌పీఎస్ నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 8 : విద్య, ఉద్యోగ, ఆర్థిక సామాజిక రంగాల్లో మాదిగలను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌పీఎస్ (మాదిగ హక్కుల పరిరక్షణ సమితి) రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ ఎంత అవసరమో, అభివృద్ధి కూడా అంతే ముఖ్యం అన్నారు. మాదిగలకు ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలన్నారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతునిచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ ఉపాధ్యక్షుడు రామతీర్థ, నాయకులు రామాంజనేయులు, నారాయణస్వామి, నాగన్న పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



ఉత్సవ బొమ్మలను ప్రదర్శనకు ఉంచిన దృశ్యం

పావగడ, అక్టోబరు 8 : భారతీయ సాంప్రదాయాలకు అద్దంపట్టేలా, ఆధునిక జీవనశైలికి అనుగుణంగా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వేణుగోపాలస్వామి ప్రధాన అర్చకుడు నరసింహశాస్త్రి తమ ఇంట్లోనే వెయ్యికి పైగా వివిధ రకాల బొమ్మలను ప్రదర్శనకు ఉంచారు. పురాతన మండపాలు, రాజగోపురాలు, రాజారాణి నివాసాలు, రామాయణం, మహాభారతం, సీతారాముల కల్యాణ ఉయ్యాలోత్సవం, పెళ్లి, సీమంతం, కృష్ణావతారం, ధార్మిక పుణ్య క్షేత్రాలను ఆయన బొమ్మలుగా గీసి ప్రదర్శించారు. అనేక మంది కళాకారులు, సీనియర్ నాయకులు ఆయన నివాసానికి వెళ్లి బొమ్మల ప్రదర్శనను చూసి ఆయనను అభినందించారు.

పల్లెల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

హిందూపురం, అక్టోబరు 8 : పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర అన్నారు. మంగళవారం ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. హిందూపురం మండలం గోళ్లాపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం సురేంద్ర మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో ప్రతి పల్లెలోనూ సీసీ రోడ్డు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అశ్వర్థనారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆదినారాయణ, నాయకులు చిక్కీరప్ప, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయి భక్తుల భిక్షాటన

హిందూపురం అర్బన్, అక్టోబరు 8: సాయి భిక్షతో ప్రజలకు సర్వదా రక్ష లభిస్తుందని నానెప్పనగర్ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు రంగస్వామి పేర్కొన్నారు. దసరా వరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హిందూపురంలో సాయి భక్తులు నాలుగు రోజుల పాటు బాబా చిత్రపటంతో ఊరేగుతారు. భక్తుల నుంచి బియ్యం, బ్యాళ్లు, బెల్లం, ఇతర ఆహార సరుకులు స్వీకరిస్తారు. వాటిని తిరిగి ప్రసాదంగా భక్తులకు అందజేస్తారన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం

లేపాక్షి, అక్టోబరు 8 : ఇటీవల కురిసిన వర్షాలకు కోడిపల్లి గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మమ్మ అనే వృద్ధురాలి ఇల్లు పైకప్పు కూలిపోయింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ వృద్ధురాలికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కూలిపని చేసుకుని బతికే లక్ష్మమ్మను ఎవరూ లేరని గ్రామస్థులు తెలిపారు.

పల్లెపండుగను విజయవంతం చేయండి

అమరాపురం, అక్టోబరు 8 : ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రామారావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనులను గుర్తించి వాటి నిర్వహణ చేపట్టేందుకు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ నాగమణి, ఉపాధి హామీ ఏపీఓ జగదీష్, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

పరిగి, అక్టోబరు 8 : సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్యాధికారి స్వరూపరెడ్డి తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించిన ఆశ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మలేరియా, డెంగీ, చికన్‌గన్యా, మెదడువాపు తదితర జబ్బులు, నివారణ చర్యలు, రక్త పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆశ, ఆరోగ్య కార్యకర్తలదే అన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఆశ వర్కర్ రామాంజినమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తోటి సహాయ ఆశ వర్కర్లు భాగ్యమ్మ, రామాంజినమ్మ కుటుంబానికి రూ.5వేలు సాయం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీనరెడ్డి, హెచ్ఈఓ వన్నప్ప, సిబ్బంది పాల్గొన్నారు.